ఎండిఎం బిల్లులు చెల్లించాలి

ప్రజాశక్తి - ముసునూరు

మధ్యాహ్న భోజనం పథక కార్మికులకు వెంటనే పెండింగ్ వేతనాల బిల్లులు చెల్లించాలని సిఐటియు జిల్లా కార్యదర్శి జి.రాజు కోరారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మధ్యాహ్న భోజనం కార్మికులకు వేతనాల బిల్లులు చెల్లించకుండా నెలలు తరబడి కాలయాపన చేస్తున్నారన్నారు. మధ్యాహ్న భోజనం కార్మికులకు చెల్లించాల్సిన వేతనాల బిల్లులను వెంటనే రాష్ట్ర ప్రభుత్వం చెల్లించాలని డిమాండ్ చేశారు. కార్మికులకు ఉద్యోగ భద్రత కల్పించాలని, పిఎఫ్, ఇఎస్ఐ సౌకర్యం కల్పించాలని, అవసరమైన వంట పాత్రలను రాష్ట్ర ప్రభుత్వం ఏర్పాటు చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో సిఐటియు మండల కార్యదర్శి కె.శ్రీనివాస్, నాయకులు నాగరాజు, కంచర్ల రమేష్ పాల్గొన్నారు.

డ్రెయిన్లన్నీ ప్రక్షాళన

ఏలూరు బస్టాండ్ వద్ద తమ్మిలేరును పరిశీలిస్తున్న సిఎం చంద్రబాబు నాయుడు

కౌలురైతులకే పంట నష్ట పరిహారం

పరిహారం ఎకరాకు రూ.6,800 నుంచి రూ.పది వేలకు పెంపు

కొల్లేరులో రెగ్యులేటర్ల నిర్మాణంపై పరిశీలిస్తాం

వరదల్లో నష్టపోయిన ప్రతిఒక్కరికీ న్యాయం చేస్తా

శనివారపుపేట కాజ్‌వేపై వంతెన నిర్మాణానికి రూ.15 కోట్లు మంజూరు

ఏలూరు పర్యటనలో సిఎం చంద్రబాబు

తమ బాధలను ఏకరవు పెట్టిన వరద బాధితులు

ప్రజాశక్తి - ఏలూరు ప్రతినిధి, అర్బన్, సిటీ

పెదపాడులో లోయర్ డ్రెయిన్‌తోపాటు అన్ని డ్రెయిన్లనూ పూర్తిగా బాగు చేయించి శివారు భూములకు సాగు నీరందిస్తామని, గత ప్రభుత్వం డ్రెయిన్లలోని పూడికతీతలో నిర్లక్ష్యం వహించడం వల్లే ఈ దుస్థితి వచ్చిందని సిఎం చంద్రబాబు తెలిపారు. వరద పర్యటనలో భాగంగా జిల్లాకు విచ్చేసిన ఆయన ముందుగా కొల్లేరు, తమ్మిలేరు, ఉప్పుటేరు వరద ప్రభావిత ప్రాంతాల్లో హెలికాప్టర్ ద్వారా ఏరియల్ సర్వే నిర్వహించారు. అనంతరం 11.48 గంటలకు ఏలూరు సిఆర్ఆర్ కాలేజీలో ఏర్పాటు చేసిన హెలీప్యాడ్‌కు సిఎం చేరుకున్నారు. అక్కడ నుంచి రోడ్డుమార్గం గుండా కొత్త బస్టాండ్ వద్ద ఉన్న వంతెన వద్దకు చేరుకుని తమ్మిలేరు వరద పరిస్థితిని పరిశీలించారు. అక్కడ నుంచి సిఆర్ఆర్ ఆడిటోరియం ప్రాంతానికి చేరుకుని వరదల ప్రభావంపై ఏర్పాటు చేసిన ఫొటో ఎగ్జిబిషన్‌ను తిలకించారు. తర్వాత వరద బాధితులతో ఏర్పాటు చేసిన ముఖాముఖీలో పాల్గొన్నారు. జిల్లా కలెక్టర్ వెట్రిసెల్వి వరద నష్టం, ప్రస్తుత పరిస్థితిని సిఎంకు వివరించారు. నూజివీడు మండలం పోతిరెడ్డిపల్లి గ్రామానికి చెందిన పి.వెంకట్రావు మాట్లాడుతూ నూజివీడు పెద్ద చెరువుకు గండి పడటంతో నీటిప్రవాహంలో చిక్కుకుని స్తంభం పట్టుకుని ఉన్నానని, మంత్రి కొలుసు పార్థసారధి జోక్యంతో ఎస్‌డిఆర్ఎఫ్ బృందం రక్షించిందన్నారు. ముదినేపల్లి మండలం పెదమానూరుకు చెందిన పొత్తుల నాగేశ్వరరావు మాట్లాడుతూ వరదలకు తన ఇల్లు కూలిపోయిందని, బంధువుల ఇంటికి వెళ్లి తలదాచుకున్నానని, ఇంటినిర్మాణానికి సాయం చేయాలని కోరారు. పెదపాడు మండలం గోగుంటకు చెందిన తిరువీధుల ఊర్మిళ మాట్లాడుతూ వదరల కారణంగా తమ గ్రామం నీట మునిగిందని, అధికారులు పునరావాస కేంద్రానికి తరలించి అన్ని ఏర్పాట్లు చేశారన్నారు. వరదలకు సర్వం కోల్పోయామని, ఆదుకోవాలని కోరారు. ఏలూరుకు చెందిన విద్యార్థి అనుషా మాట్లాడుతూ శనివారపుపేట కాజ్‌వేలతోపాటు పవరుపేటలోని అండర్ గ్రౌండ్‌బ్రిడ్జి, పోణంగి ముంపునకు గురయ్యాయని, ఏలూరు నగరం ముంపునకు గురికాకుండా శాశ్వత చర్యలు తీసుకోవాలని కోరారు. పెదపాడు మండలం కడింగుంటకు చెందిన కిషోర్‌బాబు మాట్లాడుతూ తమ మండలంలో లోయర్ డ్రెయిన్ కారణంగా వరదల సమయంలో 300 ఎకరాలు ముంపునకు గురయ్యాయన్నారు. డ్రెయిన్ మరమ్మతులు చేయించాలని కోరారు.

సిఎం చంద్రబాబు నాయుడుతో మంత్రి నిమ్మల రామానాయుడు

కొల్లేరుకు చెందిన ఘంటసాల పెద్దిరాజు మాట్లాడుతూ ఉప్పుటేరు నీటి ప్రవాహ సామర్థ్యాన్ని పెంచాలని, పది అడుగుల మేర పూడిక తీయాలని, ఉప్పుటేరుపై రెగ్యులేటర్ల నిర్మాణం చేపట్టాలని కోరారు. అనంతరం సిఎం చంద్రబాబు మాట్లాడుతూ బుడమేరు, కృష్ణా నది వరదల ఇబ్బందులు, చక్కదిద్దిన తీరు తెలిపారు. జిల్లాకు చెందిన మంత్రి నిమ్మల రామానాయుడు ఎంతో కష్టపడి బుడమేరు గండ్లు పూడ్చించారన్నారు. వైసిపి నాయకుల తీరుపై తీవ్ర విమర్శలు గుప్పించారు. జిల్లాలో తమ్మిలేరు, ఎర్రకాలువ వరదలతో ఇబ్బందులు వస్తున్నాయన్నారు. వరదలకు నష్టపోయిన ప్రతి ఒక్కరికీ న్యాయం చేస్తామని సిఎం తెలిపారు.

కౌలురైతులకే పరిహారం

పంట వేసి 70 రోజులు గడిచిన తర్వాత దెబ్బతింటే ఆ రైతు బాధ వర్ణనాతీతం అంటూ సిఎం చంద్రబాబు తెలిపారు. వ్యవసాయ సాగులో 70 శాతం కౌలురైతులే చేస్తున్నారని, పెట్టుబడి మొత్తం వారే పెడుతున్నారని అన్నారు. పంట నష్టపరిహారం కౌలురైతులకే అందిస్తామన్నారు. ఏలూరు, పశ్చిమగోదావరి జిల్లాలో అత్యధికంగా కౌలురైతులు ఉండటంతో ప్రభుత్వ నిర్ణయం రైతులకు మేలుచేయనుంది. పంట నష్టపరిహారం ఎకరాకు రూ.పది వేలు ఇవ్వనున్నట్లు ప్రకటించారు. కొల్లేరు రెగ్యులేటర్ల నిర్మాణంపై పరిశీలిస్తామన్నారు. ఉప్పుటేరు సమస్యను ఇరిగేషన్ మంత్రి రామానాయుడు చూస్తారన్నారు. 17వ తేదీలోపు పంట నష్టానికి సంబంధించిన విధివిధానాలను విడుదల చేస్తామని తెలిపారు.

శనివారపుపేట కాజ్‌వేపై వంతెన నిర్మాణం

ఏలూరు నగర నడిబొడ్డు నుంచి శనివారపుపేటకు వెళ్లే మార్గంలో తమ్మిలేరుపై ఉన్న కాజ్‌వే స్థానంలో వంతెన నిర్మాణానికి రూ.15 కోట్లు కేటాయిస్తున్నట్లు సిఎం ప్రకటించారు. తమ్మిలేరుకు వరదొచ్చిన ప్రతిసారీ కాజ్‌వేపైకి నీరు చేరడంతో రాకపోకలను నిలిపివేస్తున్నారు. దీంతో వేలాది మంది ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఏలూరు ఎంఎల్ఎ బడేటి చంటి సిఎం చంద్రబాబు దృష్టికి ఈ విషయం తీసుకెళ్లడంతో సిఎం స్పందించి నిధులు మంజూరు చేస్తున్నట్లు ప్రకటించారు. వరద బాధితుల సహాయార్థం సిఆర్ఆర్ విద్యాసంస్థల తరపున రూ.20 లక్షల చెక్కు, ఫిషరీష్, విజిటేబుల్స్ సంఘం తరపున రూ.12 లక్షల చెక్కును సిఎంకు అందించారు. సిఎం పర్యటనలో మంత్రులు నిమ్మల రామానాయుడు, కొలుసు పార్థసారధి, ఎంపీ పుట్టా మహేష్, ఎంఎల్ఎలు చింతమనేని ప్రభాకర్, బడేటి చంటి, కామినేని శ్రీనివాస్, పత్సమట్ల ధర్మరాజు, కనుమూరి రఘురామకృష్ణంరాజు, మేయర్ నూర్జహాన్, టిడిపి ఏలూరు, పశ్చిమగోదావరి జిల్లా అధ్యక్షులు గన్ని వీరాంజనేయులు, మంతెన రామరాజు పాల్గొన్నారు. హెలీప్యాడ్ వద్ద సిఎంకు పుష్పగుచ్ఛం ఇచ్చి స్వాగతం పలికిన వారిలో జెడ్‌పి ఛైర్‌పర్సన్ గంటా పద్మశ్రీ దంపతులు ఉన్నారు.

సిఎం చంద్రబాబుతో మంత్రి పార్థసారధి, ఎంఎల్ఎ చంటి మాటామంతీ

కలెక్టర్ వెట్రిసెల్వితో చర్చిస్తున్న సిఎం చంద్రబాబు



సిఎంకు విరాళం అందజేస్తున్న ప్రముఖులు



కుక్కునూరు: కివ్వాక వద్ద నీట మునిగిన పొలాలు

పోలవరం: నీట మునిగిన కడెమ్మ వంతెన

కొనసాగిన గోదావరి వరద ఉధృతి

ప్రధాన రహదారులపైకి చేరిన నీళ్లు

కుక్కునూరు - ఎ బ్లాక్‌లోని ఇళ్లలోకి వరద

25 గ్రామాలకు స్తంభించిన రాకపోకలు

ప్రజాశక్తి - కుక్కునూరు

గోదావరికి వరద ఉధృతి బుధవారం మూడోరోజు కొనసాగింది. భద్రాచలంలో గోదావరి నీటిమట్టం బుధవారం ఉదయం 50.3 అడుగులకు చేరడంతో రెండో ప్రమాద హెచ్చరిక కొనసాగింది. అనంతరం భద్రాచలంలో గోదావరి వరద తగ్గుముఖం పట్టినా మండలంలో వరద ఉధృతి మాత్రం బుధవారం రాత్రి వరకూ కొనసాగుతూనే ఉంది. ఇప్పటికే మూడు రోజులుగా మండలంలోని ముత్యాలంపాడు-వింజరం, సీతారామనగరం-వేలేరు, దాచారం-కుక్కునూరు మధ్య ఉన్న ప్రధాన రహదారులను వరద నీరు ముంచెత్తింది. దీంతో 25 గ్రామాలకు రాకపోకలు నిలిచిపోయాయి. బుధవారం వెంకటాపురం, వెంకటాపురం ఎస్‌సి కాలనీ మధ్య రహదారిపై, చీరవల్లి-వింజరం మధ్య ప్రధాన రహదారిపై వరద నీరు చేరింది. బుధవారం బెస్తగూడెం ఎస్‌సి కాలనీ సమీపంలోకి వరద నీరు చేరడంతో గ్రామంలోని బాధితులు సామాన్లు సర్దుకుని రావికుంట పునరావాస కాలనీకి తరలుతున్నారు. కుక్కునూరు ఎ-బ్లాక్ ఇళ్లలోకి వరదనీరు చేరడంతో బాధితులు కివ్వాక పునరావాస కాలనీకి, కౌండిన్యముక్తి గ్రామానికి చెందిన 60 కుటుంబాలు మద్రిపాడు పునరావాస కాలనీకి తరలుతున్నారు. మండలాన్ని గోదావరి వరద చుట్టుముట్టడంతో వందల ఎకరాల్లో ఉన్న మిర్చి, వరి పంటలు నీటి పాలయ్యాయి. దీంతో రైతులకు తీవ్ర నష్టం వాటిల్లింది.

వేలేరుపాడు:వరద ప్రభావిత ప్రాంతాల్లో జంగారెడ్డిగూడెం ఆర్‌డిఒ, డ్వామా పీడీ పర్యటన

వేలేరుపాడు రూరల్: భద్రాచలం వద్ద గోదావరి వరద నిలకడగా ఉన్నా శబరి నది ప్రవాహం ఎక్కువగా ఉండటంతో రుద్రంకోట, వేలేరుపాడు మార్కెట్లోని నివాసితులు రాత్రికి రాత్రి ఇళ్లు ఖాళీ చేయాల్సిన పరిస్థితి దాపురించింది. కొత్తూరు వద్ద వరిపంటలు నీట మునిగాయి. రుద్రంకోట, రేపాకగొమ్ము, తాట్కూర్‌గొమ్ము, వేలేరుపాడు నుంచి కన్నయ్యగుట్ట మీదుగా వెళ్లే రహదారిపైకి నీరు చేరడంతో కోయిదా, కట్కూరు వెళ్లే ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. నాళ్లవరం, కొత్తూరు, బోళ్లపల్లి తదితర గ్రామాల రహదారులు నీటమునగడంతో జనం అవస్థలు వర్ణనాతీతం.

పోలవరం: పోలవరం ప్రాజెక్టులోకి అదనంగా వస్తున్న 12,72,578 క్యూసెక్కుల జలాలను అధికారులు దిగువకు విడుదల చేస్తున్నారు. ప్రాజెక్ట్ స్పిల్‌వే ఎగువన 33.860 మీటర్లు, స్పిల్‌వే దిగువన 25.600 మీటర్ల నీటిమట్టం నమోదైనట్లు అధికారులు తెలిపారు. గోదావరి నీటిమట్టం పెరగడంతో కడెమ్మ వంతెన పూర్తిగా నీటి మునిగింది. దీంతో పోలవరం ప్రాజెక్టుకి రాకపోకలు పూర్తిగా నిలిచిపోయాయి. పోలవరం ప్రాజెక్టుకు రాకపోకలు సాగించేందుకు ప్రత్యామ్నాయ మార్గాన్ని అధికారులు యుద్ధప్రాతిపదికన ఏర్పాటు చేస్తున్నారు.

నష్టపోయిన రైతులను అన్నివిధాలా ఆదుకోవాలి

సిఎం చంద్రబాబుకు రైతుసంఘం వినతి

ప్రజాశక్తి - ఏలూరు అర్బన్

భారీ వర్షాలు, వరదల వల్ల పంటలు నష్టపోయిన రైతులు, కౌలు రైతుల పంట రుణాలు మాఫీ చేయాలని, నష్టపోయిన రైతులను అన్ని విధాలా ఆదుకోవాలని ఎపి రైతుసంఘం జిల్లా కార్యదర్శి కె.శ్రీనివాస్ కోరారు. స్థానిక సిఆర్‌రెడ్డి కాలేజీ ఆడిటోరియంలో జరిగిన కొల్లేరు, తమ్మిలేరు, ఉప్పుటేరు వరద సమీక్ష కార్యక్రమానికి విచ్చేసిన సిఎం చంద్రబాబుకు ఎపి రైతుసంఘం జిల్లా కమిటీ తరపున వినతిపత్రం అందజేశారు. అనంతరం అన్నే భవనంలో శ్రీనివాస్ మాట్లాడుతూ భారీ వర్షాలకు కొల్లేరు, బుడమేరు, తమ్మిలేరు, ఎర్ర కాలువ, గోదావరి వరదలు వల్ల, పెదవాగు ప్రాజెక్టు, నూజివీడు పెద్దచెరువు గండ్లు వల్ల జిల్లాలో వేలాది ఎకరాల్లో పంటలు దెబ్బతిని అన్నదాతలు తీవ్రంగా నష్టపోయారన్నారు. పంట నష్టాల నమోదు నిబంధనలు సవరించి పంట ఏమేరకు నష్టం జరిగినా ఎన్యుమరేషన్ చేసి పరిహారం చెల్లించి ఆదుకోవాలని కోరారు. నష్టాల నమోదులో కౌలు రైతుల పేర్లనే నమోదు చేయాలన్నారు. వరికి ఇన్‌పుట్ సబ్సిడీ ఎకరాకు రూ.6 వేలు నుండి రూ.10 వేలకు పెంచినట్లు సిఎం ప్రకటించడంపై హర్షం వ్యక్తం చేశారు. ఉద్యాన, వాణిజ్య పంటలకూ ఇన్‌పుట్ సబ్సిడీ పెంచాలని కోరారు. పంటల బీమా పరిహారం అందేలా చర్యలు చేపట్టాలన్నారు. నష్టపరిహారం కౌలు రైతులకే అందిస్తామని ముఖ్యమంత్రి ప్రకటించడం హర్షనీయమన్నారు. డెల్టా ఆధునికీకరణ పనులు చేపట్టి పంట, మురుగు కాలువలు బాగు చేయాలని కోరారు. మిత్రా, శ్రీ రామకృష్ణ కమిటీల సూచనల మేరకు కొల్లేరు, బుడమేరు, తమ్మిలేరు, ఉప్పుటేరు వరద నివారణకు శాశ్వత చర్యలు చేపట్టాలని కోరారు.

అంబేద్కర్‌నగర్‌లోకి వరద నీరు

నానావస్థలు పడుతున్న ప్రజలు

ప్రజాశక్తి - ముదినేపల్లి

ఇటీవల కురిసిన భారీ వర్షాలకు వరదనీరు పోటెత్తడంతో ముదినేపల్లిలోని అంబేద్కర్ కాలనీ ముంపుబారిన పడింది. ఇళ్లలోకి వరదనీరు వచ్చి చేరింది. వరదనీరు భారీగా వచ్చి నివాస ప్రాంతాల్లో చేరడంతో ప్రజలు తీవ్ర అవస్థలు పడుతున్నారు. గత పది రోజులుగా కురిసిన వర్షంతో మండలంలోని ప్రధాన డ్రెయిన్లు పొంగి ప్రవహించడంతో పాటు డ్రెయిన్లు ఎదురుతన్నడంతో నీరు కిందకు పారుదలలేక ఎదురుతన్నుతుంది. దీంతో వరద నీరు నివాస ప్రాంతాల్లోకి, రహదారులపైకి వచ్చి రోజులు తరబడి పారుదలలేక నిలిచిపోయింది. ఈ కారణంగా ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. నివాస ప్రాంతాల్లో మురుగునీరు దుర్గంధం వెదజల్లడంతో ప్రజలు వ్యాధుల బారిన పడుతున్నారు. డ్రెయిన్లు ఎదురుతన్నడంతో పొలాల్లోనే నీరు నిలిచిపోయింది. దీంతో మండల వ్యాప్తంగా మూడువేల పై చిలుకు ఎకరాల్లో పంటనష్టం వాటిల్లినట్లు వ్యవసాయ అధికారులు చెబుతున్నారు. భారీ వరద కారణంగా మండలంలోని పలు గ్రామాల్లో చేపల చెరువులకు గండ్లు ఏర్పడ్డాయి. దీంతో చేపలు డ్రెయిన్లలోకి కొట్టుకుపోయాయి. అలాగే పెయ్యేరు - దాకరం అంతర్గత రహదారిపై నీరు నిలిచిపోయింది. దీంతో రెండు గ్రామాల పొలిమేరలో ఉన్న రోడ్డుపై నుంచి రాకపోకలు నిలిచిపోయాయి. మండలవ్యాప్తంగా అనేక

అంబేద్కర్ నగర్‌లో చేరిన వరద నీరు

గ్రామాల్లో లోతట్టు ప్రాంతాలు జలమయం కావడంతో ప్రజలు నానాయాతన అనుభవిస్తున్నారు. ఈ వరద నీరు ఎప్పటికి తగ్గుతుందోనని ఆందోళన చెందుతున్నారు. అధికారులు స్పందించి పూడుకుపోయిన డ్రెయిన్లలో పూడిక తీసి వరద నీరు బయటకు పోయే చర్యలు తీసుకోవాలని ప్రజలు, రైతులు అధికారులను కోరుతున్నారు.

పారిశుధ్య కార్మికులను వెనక్కి రప్పించాలి

సిఐటియు ఆధ్వర్యాన కమిషనర్‌కు వినతి

ప్రజాశక్తి - ఏలూరు అర్బన్

విజయవాడలోని వరద ముంపు ప్రాంతాల్లో సహాయక చర్యలు నిమిత్తం ఏలూరు నుంచి పారిశుధ్య పనుల నిర్వహణ నిమిత్తం తీసుకెళ్లిన 500 మంది పారిశుధ్య కార్మికులకు సరైన సౌకర్యాలు, భోజన వసతులు లేవని, కావున వారిని వెంటనే వెనక్కి పంపించాలని కోరుతూ బుధవారం ఎపి మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయిస్ యూనియన్(సిఐటియు) జిల్లా కమిటీ ఆధ్వర్యంలో ఏలూరు నగరపాలక సంస్థ కమిషనర్‌కు వినతి పత్రం సమర్పించారు. ఈ సందర్భంగా యూనియన్ గౌరవాధ్యక్షులు సోమయ్య మాట్లాడుతూ కార్మికులు గత వారం రోజులుగా నీళ్లలో నానుతూ పనులు చేస్తున్నారని, వారికి ఎలాంటి గంబూట్లు గాని, గ్లోవ్స్ గాని, మాస్కులు గాని లేవని, కాళ్లు, చేతులు నీళ్లల్లో నానిపోయి పాచిపోతున్నాయని, కనీసం కొబ్బరినూనె కూడా ఏర్పాటు చేయలేదని వారు తెలిపారు. బసచేసే నివాస ప్రాంతాల వద్ద కనీసం సరైన టాయిలెట్ల సౌకర్యం లేదని, టిఫిన్, భోజనం సకాలంలో అందజేయడం లేదని, కార్మికులు వారం రోజులుగా తాము తెచ్చుకున్న డబ్బులతో బయట తినాల్సి వస్తుందని తెలిపారు. కాబట్టి వారిని వెంటనే ఆయా మున్సిపాలిటీలకు తిరిగి రప్పించాలని, లేనిపక్షంలో అక్కడే పనులు నిలిపివేసి ఆందోళన చేపడుతామని హెచ్చరించారు. యూనియన్ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు బి.బాలరాజు, ఎ.జానుబాబు పాల్గొన్నారు.

ఉపాధ్యాయులది ప్రత్యేక స్థానం : ఎంపిపి

ప్రజాశక్తి - ముదినేపల్లి

ఉపాధ్యాయులను సత్కరిస్తున్న ఎంపిపి

సమాజంలో ఉపాధ్యాయులకు ప్రత్యేక స్థానం ఉంటుందని, ఎవరికీ దొరకని గౌరవం ఒక ఉపాధ్యాయుడికే దొరుకుతుందని ఎంపిపి రామిశెట్టి సత్యనారాయణ అన్నారు. ముదినేపల్లిలోని సహాయమాత హైస్కూల్ ఆడిటోరియంలో బుధవారం గురుపూజోత్సవం సందర్భంగా నిర్వహించిన ఉత్తమ ఉపాధ్యాయ పురస్కార వేడుకల్లో ఎంపిపి సత్యనారాయణ ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చిన్నస్థాయి ఉద్యోగం నుంచి పై స్థాయికి ఎదగడంలో గురువు పాత్ర ఎంతో ఉంటుందన్నారు. అనంతరం ఉత్తమ ఉపాధ్యాయులకు ప్రశంశా పత్రాలతోపాటు మెమెంటోలు ఇచ్చి సత్కరించారు. ఈ కార్యక్రమంలో ఎంఇఒ నరేష్ కుమార్, మండలంలోని ఉపాధ్యాయులు, సన్మాన గ్రహీతల కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

విద్యార్థులకు బడి బస్సు నడపాలి : జెడ్‌పి ఛైర్‌పర్సన్

ప్రజాశక్తి - ఏలూరు సిటీ

కళాశాల, పాఠశాల విద్యార్థులకు ప్రతి రోజు క్రమం తప్పకుండా బడి బస్సు సర్వీస్‌ను నడిపేలా చూడాలని జిల్లా పరిషత్ ఛైర్‌పర్సన్ ఘంటా పద్మశ్రీ ప్రసాద్ అన్నారు. బుధవారం జిల్లా పరిషత్ క్యాంపు కార్యాలయంలో ప్రజా రవాణా సంస్థ అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఛైర్‌పర్సన్ అధికారులతో మాట్లాడుతూ పల్లె ప్రాంతం నుంచి వచ్చే పేద విద్యార్థులకు ఈ బస్సు సౌకర్యం ఉపయోగపడుతుందన్నారు. దీని మీద ఆధారపడి కళాశాలకు, పాఠశాలకు వచ్చేవారున్నారన్నారు. బస్సు సర్వీస్‌కు అంతరాయం ఏర్పడితే ప్రత్యామ్నాయ బస్సులను ఏర్పాటు చేయాలని, అలాగే కొత్త బస్‌స్టాండ్, పాత బస్‌స్టాండ్ పరిసర ప్రాంతాలను పారిశుధ్యం విషయంలో తగు జాగ్రత్తలు తీసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో జిల్లా ప్రజా రవాణా అధికారి, ఏలూరు ఆర్‌టిసి డిపో మేనేజర్ పాల్గొన్నారు.

ఓవర్‌బ్రిడ్జి నిర్మాణానికి భూసేకరణ షురూ..

కోర్టు తీర్పుతో కార్యాచరణలో కదలిక

ప్రజాశక్తి - ఉంగుటూరు

216వ నెంబరు జాతీయ రహదారిలో ఉంగుటూరు మండలం కైకరం వద్ద ఫ్లైఓవర్ వంతెన నిర్మాణానికి అడ్డంకిగా ఉన్న భూసేకరణ సమస్య కొలిక్కి వచ్చే అవకాశాలు కనిపిస్తున్నాయి. ఏలూరు జిల్లాలో ఆశ్రం ఆసుపత్రి కూడలి తరువాత అత్యధిక రోడ్డు ప్రమాదాలు జరిగేది కైకరంలోనే. గడచిన దశాబ్ధకాలంలో అనేక మంది రోడ్డు ప్రమాదంలో ప్రాణాలు కోల్పోయారు. దీంతో ఇక్కడ ఫ్లైఓవర్ నిర్మించేందుకు కేంద్ర ప్రభుత్వం నిర్ణయానికి వచ్చింది. ఇందు కోసం భూసేకరణ కోసం హైవే, రెవెన్యూ శాఖల అధికారులు గతంలోనే అన్ని రకాల సర్వేలు చేసి ప్రభుత్వానికి నివేదిక ఇచ్చారు. ప్రస్తుతమున్న రోడ్డు అంచు నుంచి 40 మీటర్లు వరకూ వంతెన, దానికి సంబంధించి సర్వీసు రోడ్డు, తదితర అవసరాల కోసం భూమిని సేకరించేందుకు సర్వే చేయగా 35 వివిధ నివాస, వ్యాపార కట్టడాలు, 20 మందికి పైగా రైతులకు చెందిన వరిపొలాలు కోల్పోతాయని అధికారులు అంచనా వేశారు. దీంతో ఆయా యజమానులు కోర్టును ఆశ్రయించగా ఇన్నాళ్లు వాదనలు జరిగాయి. ఈక్రమంలో గత నెల 22న తుది తీర్పు వచ్చింది. ప్రస్తుతం ఉన్న రోడ్డు అంచు నుంచి 60 మీటర్ల వరకూ భూసేకరణ చేసేందుకు కోర్టు గ్రీన్ సిగ్నల్ ఇవ్వడంతో కార్యరంగంలోకి దిగనున్నారు. ఈక్రమంలో ప్రొసీడింగ్స్ అనుసరించేందుకు చర్యలు తీసుకోనున్నట్లు సమాచారం. కాగా ఎంతో విలువైన తన భూములు, నివాస భవనాలు, వ్యాపార సముదాయ బిల్డింగ్స్‌లకు నష్టపరిహారం ప్రస్తుతమున్న రేటు ప్రకారం ఇవ్వాలని కోరుతున్నారు.

కైకరంలో ఫ్లైఓవర్ నిర్మించనున్న జాతీయ రహదారి

కార్మిక నేత బాబాయ్ అంత్యక్రియలు పూర్తి

బాబాయ్ అంతిమయాత్ర

ప్రజాశక్తి - నరసాపురం

సిఐటియు పట్టణ కార్యదర్శి, సిపిఎం పట్టణ కమిటీ సభ్యులు పొన్నాడ రాము (బాబాయ్) (51) అంత్యక్రియలు బుధవారం పూర్తయ్యాయి. ఆయన సోమవారం విశాఖపట్నంలో బంధువుల ఇంటికి వెళ్లి గుండెపోటుతో మృతి చెందిన విషయం తెలిసిందే. ఆయన కుమారుడు మధు ఉపాధి నిమిత్తం జమ్మూ కాశ్మీర్‌లో ఉండటంతో అంత్యక్రియలు ఆలస్యమయ్యాయి. మంగళవారం రాత్రి మధు నరసాపురం చేరుకోవడంతో బుధవారం ఉదయం అంతిమయాత్ర నిర్వహించారు. తొలుత రాము భౌతికకాయాన్ని కొత్త కాలనీలో ఇంటి వద్ద సిఐటియు జిల్లా అధ్యక్షులు జెఎన్‌వి.గోపాలన్, సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు చింత కాయల బాబూరావు, కవురు పెద్దిరాజు బాబాయ్ బాబాయ్ భౌతికకాయానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం ఎంఎల్ఎ బొమ్మిడి నాయకర్ బాబాయ్ భౌతికకాయాన్ని సందర్శించి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం అక్కడ నుంచి మిషన్ హైస్కూల్ రోడ్డు, పంజా సెంటర్, పాత బజారు, మెయిన్ రోడ్డు, స్టీమర్ రోడ్డు, శ్రీహరి పేట మీదుగా సిపిఎం కార్యాలయానికి తరలించారు. అక్కడ సిపిఎం నేతలు రాము భౌతికకాయంపై పార్టీ పతాకాన్ని కప్పి, పూల మాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం అంబేద్కర్ సెంటర్, మొగల్తూరు రోడ్డు మీదుగా రుస్తుంబాద శ్మశాన వాటికకు చేర్చి అంత్యక్రియలు నిర్వహించారు. ఈ కార్యక్రమాల్లో ఐద్వా జిల్లా కార్యదర్శి పొగాకు పూర్ణ, సిఐటియు జిల్లా ఉపాధ్యక్షుడు తెలగంశెట్టి సత్యనారాయణ, నేతలు పూరిళ్ల శ్రీనివాస్, ముచ్చర్ల త్రిమూర్తులు, పొగాకు నారాయణ రావు, మంచిలి నీలకంఠం, నోముల కొండ, బూడిద జోగేశ్వరరావు, ఇజ్రాయిల్ తదితరులు పాల్గొన్నారు.

సీజనల్ వ్యాధులపై అప్రమత్తత

ప్రజాశక్తి - ఆగిరిపల్లి

ప్రతిఒక్కరూ కాచి చల్లార్చిన నీటిని తాగటంతో పాటు, పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవడం వల్ల సీజనల్ వ్యాధులు ప్రబలకుండా నియంత్రించవచ్చని ఆగిరిపల్లి ప్రాథమిక ఆరోగ్య కేంద్ర వైద్యాధికారిణి దుర్గా భవాని అన్నారు. ఆగిరిపల్లి పిహెచ్‌సి పరిధిలోని అడవినెక్కలం గ్రామంలో బుధవారం ఉచిత వైద్యశిబిరం ఏర్పాటు చేసి రోగులకు, గర్భిణులకు పలు పరీక్షలు నిర్వహించి, మందులను అందజేశారు. ఈ కార్యక్రమంలో ఎంపిహెచ్‌ఇఒ రత్నబాబు, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

తాచుపాము హల్‌చల్..

ప్రజాశక్తి - జీలుగుమిల్లి

జీలుగుమిల్లిలోని పాత సినిమా హాల్ సమీపంలో జాతీయ రహదారి పక్కన ఉన్న ఓ హోటల్‌లో బుధవారం ఆరడుగుల గోధుమ తాచుపాము హల్‌చల్ చేస్తూ స్థానికులను భయభ్రాంతులకు గురిచేసింది. అనంతరం పక్కనే ఉన్న రేకుల్లోకి వెళ్లింది. దీంతో స్థానికులు స్నేక్ సేవియర్ సొసైటీ డైరెక్టర్ చదలవాడ క్రాంతికి సమాచారం అందించారు. దీంతో సంఘటనా స్థలానికి చేరుకొని పామును పట్టుకున్నాడు. అనంతరం దానిని బుట్టాయగూడెం సమీపంలోని అటవీ ప్రదేశంలో విడిచిపెట్టినట్లు క్రాంతి తెలిపారు. స్థానికులను భయభ్రాంతులకు గురిచేసిన పామును పట్టుకోవడంతో స్థానికులు ఊపిరి పీల్చుకున్నారు.

ఘనంగా వినాయక విగ్రహాల నిమజ్జనం

ప్రజాశక్తి - టి.నరసాపురం

మండలంలో వినాయక ఉత్సవాల్లో భాగంగా బుధవారం ఘనంగా వినాయక విగ్రహాల నిమజ్జనం నిర్వహించారు. ప్రధానంగా మండలంలోని వెలగపాడు, వీరభద్రవరం, బొర్రంపాలెం, మద్యప్పవారిగూడెం, టి.నరసాపురం గ్రామాల్లో గణేష్ మండపాల నిర్వాహకులు పూజల అనంతరం వీధుల్లో తీన్‌మార్ డప్పులతో ఊరేగించి స్థానిక చెరువులు, కాలువల్లో నిమజ్జనం చేశారు. ఈ సందర్భంగా అన్నసమారాధన కార్యక్రమాలు నిర్వహించారు. వేల సంఖ్యలో భక్తులు పాల్గొన్నారని కమిటీ సభ్యులు తెలిపారు.

రూ.25 వేలకు వినాయక లడ్డూ

ప్రజాశక్తి - ఉంగుటూరు

గణేష్ ఉత్సవాల్లో భాగంగా మండలంలోని కైకరం కొత్తూరు 1వ వార్డు పందిరిలో వినాయకుని లడ్డూకు వేలం పాట నిర్వహించారు. రంగా యువసేన పేరిట జనసేన నాయకుడు వెజ్జు సుబ్బారావు రూ.25లకు ఆ లడ్డూ దక్కించుకున్నారు. ఈ సందర్భంగా లడ్డూను నెత్తిన పెట్టుకుని ఊరేగించారు. నాయకులు కోనా శ్రీనివాసరావు, కమిటీ సభ్యులు, నిర్వాహకులు పాల్గొన్నారు.

చెక్‌పోస్ట్ పోలీసుల ఆధ్వర్యాన అన్నదానం

ప్రజాశక్తి - పోలవరం

పోలవరం ప్రాజెక్టు ప్రత్యేక భద్రతా పోలీస్ విభాగం బుధవారం పోలవరం ప్రాజెక్టు చెక్‌పోస్ట్ వద్ద గణపతి నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా భారీ అన్నదానం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో అధిక సంఖ్యలో ప్రజలు అన్నదాన కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా హెడ్ కానిస్టేబుల్ రాజేష్ మాట్లాడుతూ గణపతి నవరాత్రుల సందర్భంగా గణపతి పూజలు నిర్వహించి, నిమజ్జన కార్యక్రమం నిర్వహిస్తున్న సందర్భంగా అన్నదానం నిర్వహించినట్లు తెలిపారు. తాము పలు స్వచ్ఛంద సేవా కార్యక్రమాల్లో పాల్గొని సేవలందిస్తున్నామన్నారు. ప్రాజెక్ట్ ప్రత్యేక భద్రతా పోలీసు సిబ్బంది ఎఎస్‌ఐ శ్రీనివాసరావు, కానిస్టేబుళ్లు మురళీ, గణేష్, రాము, రాజేష్, పారి నాయుడు పాల్గొన్నారు.

తాత్కాలిక రోడ్డు ఏర్పాటు

ప్రజాశక్తి - బుట్టాయగూడెం

గత భారీ వర్షాలకు కొట్టుకొనిపోయిన పైదవారిగూడెం-పట్టినపాలెం గ్రామాల మధ్య గల రోడ్డును ఆయా గ్రామాలకు చెందిన ప్రజలు, రైతులు స్వచ్ఛందంగా ట్రాక్టర్ల సాయంతో తాత్కాలిక నిర్మాణం చేశారు. ఈ నిర్మాణానికి ఐటిడిఎ కె.ఆర్ పురం ఇంజనీరింగ్ డిపార్ట్మెంట్ వాళ్లు రెండు నీళ్లు వెళ్లే తూరలను ఇచ్చారు. లక్ష్ముడుగూడెం పంచాయతీ సర్పంచి మడకం రామలక్ష్మి ఈ పనులను దగ్గరుండి పరిశీలించారు. ఈ సందర్భంగా సర్పంచి మాట్లాడుతూ గత మూడు నెలలుగా పైదవారిగూడెం-పట్టినపాలెం గ్రామాల మధ్యలో ఉన్న ఈ రోడ్డు వర్షాలకు కొట్టుకుపోవడం వల్ల ప్రజలు, రైతులు ఇబ్బంది పడ్డారని, పైదవారిగూడెం గ్రామానికి చెందిన వ్యవసాయ భూములు కొట్టుకుపోయిన రోడ్డుకు అవతల ఉండడం వల్ల రైతులు వ్యవసాయ పనులకు తీవ్ర ఇబ్బంది జరిగిందని అన్నారు. ఈ కార్యక్రమంలో విఆర్‌ఒ ఆశా, వసంత రావు, ఉయకే వీర్రాజు, రాంబాబు, ఆకుల దుర్గరావు పాల్గొన్నారు.

పునరావాస కాలనీలో ప్రథమ చికిత్సా కేంద్రం

ప్రజాశక్తి - పోలవరం

మండలంలోని కొత్త రామయ్యపేట పునరావాస కాలనీలో బుధవారం వింజరం ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్య సిబ్బంది ప్రథమ చికిత్సా కేంద్రాన్ని ఏర్పాటు చేశారు. కొత్త రామయ్యపేట పునరావాస కాలనీలో సీజనల్ వ్యాధుల పట్ల అవగాహన కల్పించి, పరీక్షలు నిర్వహించి, మందులు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో వైద్య సిబ్బంది, ఎఎన్ఎం విజయలక్ష్మి, అరుణ, ఆశావర్కర్ రామలక్ష్మి పాల్గొన్నారు.

జిఒ 115ను రద్దు చేయాలని నిరసన

ప్రజాశక్తి - చింతలపూడి

జిఒ నెంబర్ 115ను వెంటనే రద్దు చేయాలని చింతలపూడి ప్రభుత్వ ఏరియా హాస్పిటల్ నర్సులు డిమాండ్ చేశారు. చింతలపూడి ఏరియా ప్రభుత్వ హాస్పిటల్ వద్ద 115 జిఒ రద్దు చేయాలని నర్సులు శాంతియూత నిరసన నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ జిఒ నెంబర్ 115 వెంటనే రద్దు చేయాలని, లేనిపక్షంలో విధుల నుంచి బహిష్కరిస్తామని హెచ్చరించారు. వారం రోజుల పాటు శాంతియుత నిరసన తెలుపుతామని, అప్పటికి ప్రభుత్వం స్పందించకపోతే, విధులు బహిష్కరిస్తామని తెలిపారు.

ఎస్‌టి కాలనీవాసులకు నిత్యావసరాల పంపిణీ

ప్రజాశక్తి - ముదినేపల్లి

మండలంలోని పెయ్యేరు ఎస్‌టి కాలనీవాసులకు బుధవారం దాత నిత్యవసర వస్తువులు పంపిణీ చేశాడు. గత కొన్ని రోజులుగా కురిసిన వర్షాల కారణంగా ఎస్‌టి కాలనీ వాసులు తమకి ప్రస్తుత పరిస్థితిలో పని ఏమీ లేక, బతకడానికి ఇబ్బందిగా ఉందని తహశీల్దార్ సుభానికి విన్నవించారు. ఈ విషయం తెలుసుకున్న గ్రామానికి చెందిన దాత హనుమర పెర్నీడు వెంటనే స్పందించి ఒకో కుటుంబానికి 10 కేజీల బియ్యం, 10 గుడ్లు, నూనె, పప్పు, చింతపండు, కూరగాయలు 40 బాధిత కుటుంబాలకు అందజేశారు. ఈ కార్యక్రమంలో సర్పంచి సుశీల, పంచాయతీ పాలకవర్గం సభ్యులు పాల్గొన్నారు.

క్షతగాత్రులు గమ్యస్థానాలకు తరలింపు : ఎస్‌ఐ

ప్రజాశక్తి - ఏలూరు స్పోర్ట్స్

ప్రమాదం అనంతరం క్షతగాత్రులకు చికిత్స అందించి వేరొక బస్సులో వారిని వారి వారి గమ్య స్థానాలకు తరలించామని దెందులూరు ఎస్‌ఐ స్వామి తెలిపారు. ఏలూరు జాతీయ రహదారి ఆశ్రమం ఆసుపత్రి సమీపంలో హైదరాబాద్ నుంచి ఒడిస్సా వెళుతున్న ప్రయివేట్ ట్రావెల్స్ బస్సు డివైడర్ను ఢీకొనడంతో 15 మందికి గాయాలు కాగా, మరో నలుగురికి తీవ్ర గాయాలు అయ్యాయి. మంగళవారం అర్ధరాత్రి 12.30 గంటల సమయంలో ఈ ఘటన చోటు చేసుకుంది. హైదరాబాద్ నుంచి ఒడిస్సా వెళ్లే శ్రీసాయి బాలాజీ ప్రయివేట్ ట్రావెల్స్ బస్సు ఏలూరు జాతీయ రహదారిపై డివైడర్‌ను ఢీ కొట్టింది. ఈ ప్రమాదంలో సుమారు 15 మంది ప్రయాణికులకు గాయాలు కాగా, మరో నలుగురికి తీవ్ర గాయాలు అయ్యాయి. ఈ ప్రమాదం నేపథ్యంలో అప్రమత్తమైన హైవే మొబైల్ టీం పోలీసులు 108 వాహనాల్లో క్షతగాత్రులను ఏలూరు ప్రభుత్వ ఆసుపత్రికి, కొంతమంది ఆశ్రమ ఆసుపత్రికి తరలించారు. వైద్యులు చికిత్స అందిస్తున్నారు. ట్రావెల్స్ బస్సు డ్రైవర్ ప్రసాద్‌కు తీవ్ర గాయాలు అయ్యాయి. ప్రయాణికులు శ్రీకాకుళం జిల్లా పాతపట్నం, ఒడిస్సాకు చెందిన వారు ఉన్నారు. బస్సు స్టీరింగ్ ఆకస్మికంగా పట్టేయటంతో ప్రమాదం జరిగిందని డ్రైవర్ ప్రసాద్ చెబుతున్నారు.

ట్రిపుల్ ఐటి రిజిస్ట్రార్‌గా అమరేంద్ర కుమార్ సంద్ర

ప్రజాశక్తి - నూజివీడు టౌన్

ఆర్‌జియుకెటి రిజిస్టర్‌గా ఆర్‌కె వ్యాలీ క్యాంపస్ సివిల్ ఇంజనీరింగ్ విభాగంలో పనిచేస్తున్న ప్రొఫెసర్ అమరేంద్ర కుమార్ సంద్రను వైస్ ఛాన్సర్ విజయ్ కుమార్ నియమించారు. ఈయన 2016లో సివిల్ ఇంజనీరింగ్ విభాగంలో అసోసియేట్ ప్రొఫెసర్‌గా చేరి 2021వ సంవత్సరంలో ప్రొఫెసర్‌గా ఉద్యోగోన్నతి పొందారు. ఆర్‌కె వ్యాలీ క్యాంపస్‌లో కంట్రోలర్ ఆఫ్ ఎగ్జామినేషన్ గాను, పరిపాలనాధికారి, డైరెక్టర్‌గా కూడా పని చేశారు. ఆయనను రిజిస్టర్‌గా నియమించడం పట్ల నాలుగు క్యాంపస్ల అధికారులు, అధ్యాపకులు హర్షం వ్యక్తం చేశారు.

ప్రజాశక్తి
ప్రతి అక్షరం - ప్రజల పక్షం
పత్రిక పంపిణీలో ఇబ్బందులున్నవారు
ఈక్రింది నెంబర్లను సంప్రదించండి
ఏలూరు జిల్లా సర్క్యులేషన్ వివరాల కోసం
సెల్: 94900 99190
పశ్చిమగోదావరి జిల్లా సర్క్యులేషన్ వివరాల కోసం
సెల్: 83339 88814

సమస్యల వలయంలో గిరిజన తండా

ప్రజాశక్తి - టి.నరసాపురం

ప్రభుత్వాలు మారినా, పాలకులు మారినా మండలంలోని కృష్ణాపురం గిరిజన తండా వాసులకు అవస్తలు తప్పడం లేదు. ఏళ్లు గడుస్తున్నా గ్రామంలో రోడ్లు, డ్రైయినేజీ వ్యవస్థ లేదు. తాగునీటి ఫైపులైన్ వ్యవస్థ లేదు, ఇలా ఎన్నో సమస్యలు తిష్ట వేసుకుని ఉండడంతో గ్రామస్తులు ఎన్నో ఇబ్బందులు పడాల్సి వస్తుందని వారంటున్నారు. గ్రామంలో సరైన వసతులు లేక పారిశుధ్యం లోపించడంతో గ్రామంలో ఎక్కువ మంది అనారోగ్యాలకు గురవుతున్నారని, ఉన్నతాధికారులు వెంటనే స్పందించి గ్రామంలో సమస్యలు పరిష్కరించాలని, మౌళిక సదుపాయాలు కల్పించాలని గ్రామస్తులు డిమాండ్ చేస్తున్నారు.

మండలంలోని టి.నరసాపురం పంచాయతీ పరిధిలో ఉన్న కృష్ణాపురం గ్రామంలో గిరిజన తండా ప్రజలు సుమారు ఎనిమిది వందల కుటుంబాల వరకు నివాసముంటున్నారు. పూర్తి గిరిజన గ్రామంగా ఉన్న ఆ ఊరిలో సరైన రోడ్లు లేవని, డ్రైయినేజీ వ్యవస్థ లేదని గ్రామస్థులు అంటున్నారు. గ్రామంలో కొండపైగా ఉండడంతో సందు రోడ్లు లేవని దీంతో ఇంటి నుంచి బయటకు వాహనాలపై వెళ్లాలన్నా ఇబ్బందులు పడాల్సి వస్తుందని వారంటున్నారు.

రోడ్లు, డ్రైయినేజీ వ్యవస్థ లేక గ్రామస్తుల అవస్తలు
పారిశుధ్య లోపంతో ప్రబలుతున్న అనారోగ్యాలు
పట్టించుకోని అధికారులు
సమస్యలు పరిష్కరించాలని గిరిజనుల వేడుకోలు

గ్రామంలో అధ్వాన్నంగా ఉన్న రోడ్డు

అంతేకాక డ్రైయినేజీ వ్యవస్థ కూడా లేదని, దీంతో గ్రామస్తులు ఇళ్లల్లో వాడి వదిలేసిన మురుగు నీరు ఎక్కడబడితే అక్కడ నిలిపోతుందని, తద్వారా దోమలు ప్రబలుతున్నాయని చెబుతున్నారు. ప్రతి ఇంటికి తాగునీరు అందించేందుకు సరైన ఫైపులైన్ వ్యవస్థ కూడా లేదని, అందువల్ల గ్రామస్తులు డ్రిప్ ఫైపుల ద్వారా నీటిని పట్టుకుంటున్నారని, అలా సరఫరా అవుతున్న తాగునీరు కలుషితమై అనారోగ్యాలు వస్తున్నాయని గ్రామస్తులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. గ్రామంలో నెలకొన్న సమస్యలపై ఎంఎల్‌ఎ, ఎంపీ, మండలాధికారులకు చెప్పినా ప్రయోజనం లేదని, ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి గ్రామంలోని సమస్యలను వెంటనే పరిష్కరించాలని డిమాండ్ చేస్తున్నారు.

డ్రైయినేజీ వ్యవస్థ లేక రోడ్డుపైనే మురుగు

రోడ్లు, డ్రైయినేజీ వ్యవస్థ ఏర్పాటు చేయాలి

భుక్యా వేణు, కృష్ణాపురం

గ్రామంలో ఎన్నో ఏళ్లుగా సరైన రోడ్లు, డ్రైయినేజీ వ్యవస్థ లేదు. దీంతో మేము అనేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నాం. గ్రామంలో నెలకొన్న సమస్యలపై ఎన్నోమార్లు ప్రజాప్రతినిధులు, అధికారులకు చెప్పాం అయినా పరిష్కారం కాలేదు. ఉన్నతాధికారులు స్పందించి రోడ్లు, డ్రైయినేజీ వ్యవస్థ ఏర్పాటు చేసి, సమస్యలు పరిష్కరించాలి.

తాగునీటి ఫైపులైన్ ఏర్పాటు చేయాలి

భుక్యా సత్యం, కృష్ణాపురం

గ్రామంలో సరైన ఫైపులైన్ వ్యవస్థ లేదు. తాగునీటి సరఫరా కోసం గ్రామస్తులు డ్రిప్ ఫైపులు పెట్టుకుని నీళ్ల పట్టుకుంటున్నారు. దీంతో నీరు కలుషితమై అనారోగ్యాలు వస్తున్నాయి. ఇంకా గ్రామంలో వీధి రోడ్లు లేవు, డ్రైయినేజీలు లేవు, గ్రామంలో ఉన్న సమస్యలు అధికారులు పరిష్కరించాలి.

ప్రభుత్వం గిరిజన గ్రామాలపై దృష్టి సారించాలి

ప్రజాశక్తి - బుట్టాయగూడెం రూరల్

గిరిజన గ్రామాల్లో సక్రమ రహదారులు లేకపోవడం వల్ల ప్రజలు ఆరోగ్య సౌకర్యాలు, విద్యా అవకాశాలు సద్వినియోగం చేసుకోవడంలో ఇబ్బందులు పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ముఖ్యంగా వర్షాకాలంలో రాకపోకలు పూర్తిగా నిలిచిపోవడం వల్ల ప్రజలు అనేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. గతంలోని గోగుమెల్లి గ్రామం వరకు బస్సు సౌకర్యం ఉండేది. కానీ కొన్ని సంవత్సరాల నుంచి బస్ సౌకర్యం కూడా లేకపోవడంతో గిరిజన ప్రజలు రాకపోకలకు ఇబ్బందులు పడుతున్నారు.

13 నుంచి బాలుర ఆటల పోటీలు

ప్రజాశక్తి - ముసునూరు

ముసునూరు, నూజివీడు, ఆగిరిపల్లి, చాట్రాయి మండల వ్యాయామ ఉపాధ్యాయుల సమావేశం ఎస్‌ఆర్‌ఆర్ జిల్లా పరిషత్ పాఠశాలలో ప్రధానోపాధ్యాయుని డాక్టర్ హేమలత అధ్యక్షతన నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ నియోజకవర్గ స్కూల్ గేమ్స్ సెలక్షన్స్ క్రీడాకారులకు మధ్యాహ్న భోజన వసతి ఏర్పాటు చేయటం జరుగుతుందని తెలిపారు. నూజివీడు మండల బాలుర ఆటల పోటీలు 13వ తేదీ నుంచి జరుగుతాయని అన్నారు. ఈ కార్యక్రమంలో వ్యాయామ ఉపాధ్యాయులు సుకుమార్, రాజేంద్రప్రసాద్, లక్ష్మి, వనజ, ఆరతి, రాజేశ్వరి, రాణి, సరళ, నాగేశ్వరరావు, నాగరాజు, హేమ, శివనాగేంద్రరావు, సుగుణరావు, ఉమ, ప్రభాకర్, విజయ్, ప్రమీలారాణి, టివి.నాగేశ్వరరావు, రవీంద్ర పాల్గొన్నారు.


పళ్లు అందజేస్తున్న నాయకులు

రోగులకు పండ్లు, బిస్కెట్లు పంపిణీ

ప్రజాశక్తి - ఆగిరిపల్లి

ప్రపంచ మానవహక్కుల అవ గాహనా సంఘం ఆధ్వర్యంలో రోగులకు పండ్లు, బిస్కెట్లు, బ్రెడ్‌లు పంపిణీ చేయటం ఎంతో అభినందనీయమని అ మ్మవారిగూడెం ఎంపి టిసి, న్యాయవాది రానిమేకల సత్య నారాయణ అ న్నారు. గ్లోబల్ హ్యూమన్ రైట్స్ అవేర్‌నెస్ అసోషియేషన్ 4వ వార్షికోత్సవ వేడుకలను పురస్కరించి ఆగిరిపల్లి పిహెచ్‌సిలో వున్న రోగులకు పండ్లు, బిస్కెట్స్, బ్రెడ్‌లను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో సంఘం నాయకులు పి.సురేష్ కుమార్, ఎన్.రామకృష్ణ, ఎం.సతీష్‌కుమార్, పివి.కోటేశ్వరరావు, టి.మురళీధర్, ఎస్ఎస్.బాబు, వైద్యాధికారి ఎస్‌కె.నజ్మాలు పాల్గొన్నారు.

పనులు పూర్తిచేయాలి : డిఎంహెచ్‌ఒ

ప్రజాశక్తి కథనానికి స్పందన

ప్రజాశక్తి - కామవరపుకోట

ఈనెల 11వ తేదీ బుధవారం ప్రజాశక్తిలో 'భవనం ప్రారంభించారు.. సేవలు మరిచారు..!' అనే శీర్షికతో తడికలపూడి సచివాలయం-2 పరిధిలోని హెల్త్ అండ్ వెల్నెస్ సెంటర్ గురించి ప్రచురితం అయిన కథనంకి జిల్లా వైద్య, ఆరోగ్య శాఖాధికారి డాక్టర్ శర్మిష్ఠ స్పందించారు. ఈ భవనం నందు నీటి కనెక్షన్, ఇతరేతర పనులు అసంపూర్తిగా కావడం వల్ల పనులు పూర్తిచేయాలని పంచాయతీ సిబ్బందికి సూచించారు. వారు కూడా త్వరితగతిన పనులు పూర్తి చేస్తామని తెలియజేశారని ఆమె తెలిపారు. పెండింగ్ పనులు పూర్తి అయిన వెంటనే హెల్త్ అండ్ వెల్నెస్ సెంటర్ నూతన భవనం నుంచి వైద్య సేవలు అందిస్తామని తెలియజేశారు. ప్రజాశక్తి కథనంపై స్పందించి చర్యలు తీసుకోవడం పట్ల పలువురు గ్రామస్థులు హర్షం వ్యక్తం చేశారు.

ఘనంగా అటవీశాఖ అమరవీరుల దినోత్సవం

పోలవరం: విధి నిర్వహణలో ప్రాణాలర్పించిన ఉద్యోగులు అమరులని, వారిని దేశ ప్రజలు ఎన్నటికీ మరువరని డిప్యూటీ రేంజ్ అధికారి ఎ.సూరిబాబు అన్నారు. బుధవారం అటవీశాఖ అమరవీరుల దినోత్సవం సందర్భంగా అటవీశాఖ కార్యాలయం వద్ద అటవీశాఖ అమరవీరుల దినోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా అమరవీరుల చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించి మౌనం పాటించారు. ఈ సందర్భంగా అమరులైన అటవీశాఖ ఉద్యోగుల విజయాల గురించి డిఆర్ సిబ్బందికి వివరించి ప్రతిఒక్కరూ విధులలో నిబద్ధతో, నిజాయితీతో వ్యవహరించాలని సూచించారు. డిఆర్.ధర్మయ్య, ఫారెస్ట్ సెక్షన్ ఆఫీసర్ సిహెచ్.ఈశ్వరరావు, కె.బాబూరావు, మధుకర్, పరమేశ్వరరావు, రమాదేవి, మణికుమారి, ప్రసన్నకుమారి, రాజేష్, హరిప్రియ, భానుప్రవీణ్, సత్యన్నారాయణ పాల్గొన్నారు.

అమరవీరులకు నివాళులర్పిస్తున్న పోలీసులు

ఘనంగా పౌష్టికాహార మాసోత్సవం

విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న సిడిపిఒ

ప్రజాశక్తి - కామవరపుకోట

స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో పౌష్టికాహార మాసోత్సవాలలో భాగంగా పోషకాహారంపై ముఖ్యంగా ఆకు కూరలపై తల్లులు ప్రత్యేక శ్రద్ధ చూపాలని సిడిపిఒ పి.బ్యూలా అన్నారు. ఆమె హైస్కూల్ స్థాయి ఆడ పిల్లలు ఆరోగ్యం, సమతుల్య ఆహారంపై శ్రద్ధ తీసుకోవాలి అన్నారు. ఆకుకూరల నమూనా చిత్రాల ద్వారా ఆకుపచ్చని, నారింజ, తెలుపు వర్ణం ముగ్గులు గీచి పిల్లలకు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంపై క్విజ్, వక్తృత్వ, వ్యాసరచన పోటీలు నిర్వహించి విద్యార్థులకు ప్రథమ, ద్వితీయ, తృతీయ బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో మండల విద్యాశాఖ అధికారి-2 సిహెచ్.ప్రశాంత్, ఐసిడిఎస్ సూపర్ వైజర్లు ఎన్.వీరకుమారి, బివిఎల్.మంగాదేవి, హెచ్‌వి.సరోజిని, ఉపాధ్యాయులు కె.రమేష్, బి.కిషోర్, కె.శ్రీహరి, పోరంకి నాగరాజు, వి.సుశీలాకుమారి, ఎస్ఎంసి చైర్మన్ డాన్ దివాకర్ బొబ్బిలి, విద్యార్థులు, పలువురు అంగన్వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

వరద బాధితులకు విరాళాల సేకరణ

జీలుగుమిల్లిలో..

ప్రజాశక్తి - జీలుగుమిల్లి

విజయవాడ వరద బాధితుల సహాయార్థం సిఐటియు మండల కమిటీ అధ్వర్యంలో కొంత నగదు సేకరించినట్లు సిఐటియు మండల కార్యదర్శి చిట్టిబొమ్మ కొండలరావు తెలిపారు. దాతలు ఎవరైనా విరాళాలు ఇవ్వాలంటే స్వచ్ఛందంగా ముందుకు రావాలని ఆయన పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో నాయకులు సిరిబత్తుల సీతారామయ్య, జగదీష్, విఐఎ లక్ష్మి కుమారి, మిడ్ డే మిల్స్ వర్కర్లు మంగ, లక్ష్మి, పార్వతి పాల్గొన్నారు.

హెల్పింగ్ హాండ్స్ ఆధ్వర్యాన

నూజివీడు టౌన్ : నూజివీడులోని హెల్పింగ్ హాండ్స్ వారు విజయవాడ వరద బాధితులకు తమ వంతు సాయంగా ఆర్‌జియుకెటి క్యాంపస్‌లో స్టూడెంట్స్, ఫ్యాకల్టీ నుంచి సేకరించిన బట్టలు వితరణ చేశారు. ఈ కార్యక్రమాన్ని ఆర్‌జియుకెటి నూజివీడు డైరెక్టర్ ప్రారంభించారు. మొత్తం 175 కుటుంబాలకు వారు విజయవాడలో బట్టలు పంపిణీ చేసి సమాజం పట్ల వారి బాధ్యతను నిర్వహించారు. 175 కవర్లలో 1647 జతలను ఆర్‌జియుకెటి క్యాంపస్‌లో సేకరించి హెల్పింగ్ హాండ్స్ సభ్యులు విజయవాడలో పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో హెల్పింగ్ హాండ్స్ ఫ్యాకల్టీ మెంబెర్స్, వారితో పాటు హెల్పింగ్ హాండ్స్ స్టూడెంట్ వాలంటీర్లు ఎంతో ఉత్సాహంగా పాల్గొన్నారు. ఇది సాధ్యం అయ్యేందుకు క్యాంపస్‌లో బట్టలు సేకరించడానికి అనుమతించిన ఆర్‌జియుకెటి అడ్మినిస్ట్రేషన్‌కు, బట్టలు ఇచ్చిన ఫ్యాకల్టీ, స్టూడెంట్స్‌కు హెల్పింగ్ హాండ్స్ వారు కృతజ్ఞతలు తెలిపారు.

సిపిఐ ఆధ్వర్యాన..

కామవరపుకోట : వరద బాధితులను ఆదుకోవడం కోసం విరివిగా విరాళాలు ఇవ్వాలని వర్తక, వ్యాపార సంస్థల ప్రతినిధులను, ప్రభుత్వ ఉద్యోగులను సిపిఐ ప్రతినిధుల బృందం కోరగా వారు స్పందించి రూ.7,950 విరాళాలు అందించారని సిపిఐ మండల కార్యదర్శి టివిఎస్.రాజు తెలిపారు. రాజకీయాలకతీతంగా విరాళాలు అందించిన దాతలకు సిపిఐ ధన్యవాదాలు తెలిపింది. సేకరించిన విరాళాలు రూ.7,950 సిపిఐ జిల్లా కార్యదర్శి మన్నవ కృష్ణచైతన్య ద్వారా విజయవాడ వరద బాధితులకు పంపడం జరుగుతుందని ఆయన తెలిపారు. విరాళాల సేకరణలో సిపిఐ మండల సహాయ కార్యదర్శి కంకిపాటి బుచ్చిబాబు, మండల కార్యవర్గసభ్యులు జి.సత్యనారాయణ, చలమాల శ్రీనివాసరావు, ఎఐటియుసి ముఠా వర్కర్స్ యూనియన్ ప్రతినిధులు నల్లమోతుల కృష్ణ, ఎన్నంశెట్టి గంగాజలం, పరస శ్రీను, నల్లమోతుల అప్పన్న, రైస్‌మిల్ వర్కర్స్ యూనియన్ నాయకుడు కోతాటి వెంకటేశ్వరరావు, ప్రజానాట్యమండలి గాయకుడు కంకిపాటి ఏసుపాదం, ఎఐటియుసి నేత నల్లమోతుల అప్పన్న పాల్గొన్నారు.


నూజివీడులో..

రామకృష్ణ, ఐలమ్మ, రాజారావులకు నివాళి

ఏలూరు అర్బన్: విద్యుత్ పోరాట అమరవీరుడు సత్తెనపల్లి రామకృష్ణ, తెలంగాణ సాయుధ పోరాట యోధురాలు చాకలి ఐలమ్మ, ప్రజా కళాకారుడు డాక్టర్ గరికపాటి రాజారావుల వర్ధంతి కార్యక్రమం బుధవారం స్థానిక ఆర్‌ఆర్ పేటలోని చేతివృత్తిదారుల సమన్వయ కమిటీ జిల్లా కార్యాలయంలో నిర్వహించారు. ముందుగా ఆయా నాయకుల చిత్రపటాలకు కమిటీ జిల్లా కన్వీనర్ పిచ్చుక ఆదిశేషు, కంది విశ్వనాథం, ఆగొల్ల వెంకటకృష్ణారావులు పూలమాలలు వేసి జోహార్లు అర్పించారు. ఈ సందర్భంగా ఆదిశేషు మాట్లాడుతూ 2000 సంవత్సరంలో ఆంధ్రప్రదేశ్‌ను ప్రపంచ బ్యాంకుకు ప్రయోగశాలగా మార్చిన చంద్రబాబు నాయుడు విధానాలకు వ్యతిరేకంగా పెంచిన విద్యుత్ ఛార్జీలు తగ్గించాలని రాష్ట్రవ్యాప్తంగా వామపక్షాలు 100 రోజులపాటు పెద్ద ఎత్తున వివిధ రూపాలలో ఆందోళన పోరాటాలు నిర్వహించారన్నారు. ఆ పోరాటంలో రాష్ట్ర కేంద్రంలో వృత్తి సంఘాల బాధ్యతలు చూస్తున్న సత్తెనపల్లి రామకృష్ణ, బాలస్వామి, విష్ణువర్ధన్ రెడ్డి, బషీరాబాద్ పోలీస్ కాల్పులలో మరణించారన్నారు. లాఠీఛార్జిలో వందలాది మంది క్షతగాత్రులు అయ్యారని, ఇంత దారుణం జరిగినా చంద్రబాబు నాయుడు చలించలేదన్నారు. ప్రపంచ బ్యాంకు విధానాలకు వ్యతిరేకంగా పోరాడటమే కర్తవ్యంగా పనిచేయాలని తెలిపారు.

క్రిమిలేయర్ విధానంపై ఆందోళన

ప్రజాశక్తి - నూజివీడు టౌన్

నూజివీడు పట్టణంలో మాలయోధుల సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో ఎస్‌సి, ఎస్‌టి వర్గీకరణ తీర్పుకు వ్యతిరేకంగా బుధవారం ఆందోళన చేపట్టారు. అంబేద్కర్ వాది చేబత్తిన కోటేశ్వరరావు(మున్న) మాట్లాడుతూ దళితుల్లో ఐక్యత విచ్ఛిన్నం చేసే దిశగా తీర్పు ఉన్నట్లు పేర్కొన్నారు. క్రిమిలేయర్ అనే విధానం ఎంతో దారుణమన్నారు. వర్గీకరణ, క్రిమిలేయర్ విధానాన్ని విభేదిస్తూ ఆందోళన కొనసాగిస్తామన్నారు. తమ ఉద్యమానికి మాదిగలు సహకరించాలని కోరారు. ఒకరికి ఒక్కసారే రిజర్వేషన్ ప్రాతిపదికన క్రిమిలేయర్ ఏర్పాటు చేయడం దారుణమని తెలిపారు. ఈ విధంగా ఎస్‌సి, ఎస్‌టిలను విడదీసే తీర్పును వ్యతిరేకిస్తూ పోరాడేందుకే మాలయోధుల సంక్షేమ సంఘం ఏర్పాటు చేసినట్లు వివరించారు. అనాధిగా అగ్రకులాల అణచివేతను ఎదురిస్తూ రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బిఆర్.అంబేద్కర్ రూపొందించిన భారత రాజ్యాంగం ప్రపంచ దేశాలకు ఆదర్శనీయంగా నిలిచిందన్నారు. డాక్టర్ అంబేద్కర్ రాజ్యాంగాన్ని జాతికి అంకితం చేసిన తరువాత బడుగు బలహీన వర్గాలు చదువుల్లోనూ, ఉపాధిలోను ముందడుగు వేసిన నిజాన్ని ఏఒక్కరు మర్చిపోకూడదన్నారు. అలాంటి రాజ్యాంగబద్ధమైన రిజర్వేషన్ పొందడానికి క్రిమిలేయర్ అనే విధానాన్ని అడ్డుపెట్టడం దారుణమని ఆవేదన వ్యక్తం చేశారు. రిజర్వేషన్ అమలులో ఇలాంటి విధానాలను ఎల్లవేళలా వ్యతిరేకిస్తామని, సమైక్యంగా పోరాడతామని స్పష్టం చేశారు. ఈమేరకు ఆర్‌డిఒ భవాని శంకరికి వినతిపత్రం అందించారు. ఈ కార్యక్రమంలో ఎస్‌సి ఐక్య కార్యాచరణ సమితి సభ్యులు నత్త నాగేశ్వరరావు, కాలి సురేష్, రాజ్ కుమార్, రుద్రపాటి ప్రసాద్, నత్త నాగేశ్వరావు, కాలి సురేష్, పిల్లా చరణ్, కృష్ణంరాజు, తులిమెల్లి ఇశ్రాయేలు, రాజ్‌కుమార్, ఉదయరాజు, సభ్యులు పాల్గొన్నారు.


ఆర్‌డిఒకు వినతిని అందజేస్తున్న నేతలు

14న విద్యుత్ సరఫరాకు అంతరాయం

ప్రజాశక్తి - ఉంగుటూరు

పెదతాడేపల్లి 132 కేవీ సబ్ స్టేషన్ మరమ్మతుల కారణంగా ఈనెల 14న నారాయణపురం, ఉంగుటూరు, యర్రమళ్ల, వెల్లమిల్లి, బాదంపూడి, చేబ్రోలులో 33 కేవీ సబ్ స్టేషన్ల పరిధి గ్రామాల్లో గృహ, పరిశ్రమలకు విద్యుత్ సరఫరా ఉండదని అధికారులు వెల్లడించారు. వినియోగదారులు సహకరించాలని నారాయణపురం ఎఇ శ్రీరామ్ పేర్కొన్నారు.

రోడ్డుపైకి నీళ్లు వచ్చాయని దాడి

చికిత్స పొందుతున్న బాధితులు

ప్రజాశక్తి - ముసునూరు

మండలంలోని వలసపల్లి గ్రామంలో వాడుకున్న నీళ్లు రోడ్లపైకి వచ్చాయని రోడ్డు సమీపంలోని వారు దాడిచేసినట్లు నందిపం అనురాధ, పల్లెపాము సునీత బుధవారం ఆవేదన వ్యక్తం చేశారు. గాయాలపాలైన వీరిని 108 ద్వారా అంబులెన్స్‌లో నూజివీడు ఏరియా ఆసుపత్రికి తరలించారు. రాళ్లు, కర్రలు, పారలతో దాడి చేశారని, గత మూడు నెలలుగా వేధిస్తున్నారంటూ బాధితులు వాపోతున్నారు. పోలీసులు సమాచారం సేకరించి, కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

పేయ్యేరులో అగ్నిప్రమాదం

మూడు గేదెల మృతి

ప్రజాశక్తి - ముదినేపల్లి

మండలంలోని పేయ్యేరులో బుధవారం తెల్లవారుజామున జరిగిన అగ్ని ప్రమాదంలో మూడు గేదెలు మృతి చెందడంతో పాటు పశువుల పాక దద్దమైన సంఘటన జరిగింది. బాధితుడు నిడుమోలు కోటేశ్వరరావు తెలిపిన వివరాల ప్రకారం తెల్లవారుజామున 4 గంటల సమయంలో వీధి లైన్ విద్యుత్ తీగ తెగి పశువుల పాకపై పడింది. దీంతో పశువుల పాకను నిప్పు రవ్వలు చుట్టుముట్టాయి. విషయం తెలుసుకున్న పశువుల యజమాని కోటేశ్వరరావు పశువులను కాపాడేందుకు సాహసించి, పాకలో ప్రవేశించి, పశువుల తాళ్లను కత్తితో కోసి వేశాడు. అప్పటికే నిప్పు పాకను అలుముకోవడంతో ప్రాణాలు కాపాడుకునేందుకు బయటకు పరుగులు తీశాడు. అయితే పాక చుట్టు పరదాలు కట్టి ఉండడం, పాకలో దట్టంగా పొగా కమ్ముకోవడంతో బయటికి పశువులు రాలేకపోయాయి. మంటల్లో నాలుగు పశువులు తీవ్రంగా గాయపడగా, మూడు పశువులు మృతి చెందాయి. మరో పాడి గేదె ప్రాణాపాయ స్థితిలో కొట్టుమిట్టాడుతుంది. గుడివాడ నుంచి వచ్చిన అగ్నిమాపక సిబ్బంది మంటలు ఇతర ప్రాంతాలకు వ్యాపించకుండా అదుపులోకి తెచ్చాయి. మృతి చెందిన గేదెల విలువ రూ.3 లక్షలు విలువ చేస్తాయని, అలాగే కాలిపోయిన పాక మరో లక్ష రూపాయలు విలువ చేస్తుందని, ఈ అగ్ని ప్రమాదంలో రూ.4 లక్షల మేర తనకు ఆస్తినష్టం జరిగినట్లు బాధితుడు కోటేశ్వరరావు తెలిపారు. ప్రభుత్వం తనను ఆదుకోవాలని కోటేశ్వరరావు కోరుచున్నాడు. గ్రామ విఆర్‌ఒ కార్య కేశవ ఘటనా స్థలానికి వచ్చి ప్రమాదం జరిగిన తీరును బాధితుడిని అడిగి తెలుసుకున్నారు.

మహారాజశ్రీ 5వ అదనపు జిల్లా జడ్జివారి కోర్టు రాజమహేంద్రవరం
M.V.O.P.118/2023

Between:
1. Polinati Ranga Rao
2. Polinati Baby
3. Polinati Sujatha ...Petitioners

And

Kamireddy Veera Venkata Subrahmanyam, and others ...Respondents

R3. Amirapu Peddi Raju, S/o.Jayarama Krishna, Hindu, Male, Aged 48years, Owner(As per Insurance Policy) of Tata Ace Van bearing No.**AP-37-TA-3858**, R/o.D.No.2-56, Kalla Village and Mandalam, W.G.Dt.Bhimavaram DMC. ...3rd Respondent.

పై నంబరు పిటీషన్‌లో 3వ రెస్పాండెంటు అయిన మీకు కోర్టు ద్వారా ఎన్నిసార్లు సమన్లు/నోటీసులు పంపినా మీరు వాటిని తీసుకోకుండ ఉద్దేశ్యపూర్వకంగా త్రిప్పి వేయుచున్నారు. కావున ది. **30-09-2024** సం॥రం తేదీ ఉదయం **10.30** ని॥లకు మీరు స్వయంగా గాని లేదా ప్లీడరు ద్వారా గాని పై కోర్టు వారి ఎదుట హాజరు అయ్యి సదరు పై పిటీషను లో మీ ఆక్షేపణలను తెలుపుకొనవలెను. లేనియెడల సదరు పిటీషను మీకు పరోక్షముగా శ్రీ కోర్టు వారు తీర్మానించెదరు.

(శ్రీ కోర్టు వారి ఉత్తర్వుల ప్రకారం)
బి.మహేష్‌కుమార్
అడ్వకేటు
రాజమండ్రి
రాజమండ్రి
11-09-2024
8885551188

మహారాజశ్రీ 2వ అడిషనల్ సివిల్ జడ్జి (జూనియర్ డివిజన్), తాడేపల్లిగూడెం వారి కోర్టులో
E.P. 63/2022 in O.S. 96/2022

Between:
కవల నాగరాజు ...DHR

AND

కాకర్ల రామ సుబ్బారావు ...JDR

పై నెంబరు E.P. గ్రంధములో DHR కు రావలసిన బాకీ గురించి JDR కు చెందిన ఈ దిగువ షెడ్యూలు దాఖలా ఆస్తిని **ది. 3-10-2024వ తేదీన పైన తెల్పిన కోర్టులో ఉదయం గం॥ 10.30 ని॥లకు** వేలము వేయుటకు శ్రీ కోర్టు వారు ఆర్డరు వేసియున్నారు. కావున వేలం పాటలో పాల్గొనదలచినవారు పై తెలిపిన తేదీన శ్రీ కోర్టు వారి ఎదుట హాజరై వేలం పాటలో పాల్గొని పాడుకొనవచ్చును. సదరు వేలమునకు వేలము షరతులు వర్తించునని యిందు మూలముగా తెలియజేయడమైనది.

షెడ్యూలు

ప॥గో॥జిల్లా, తాడేపల్లిగూడెం సబ్‌రిజిస్ట్రీ, తాడేపల్లిగూడెం మున్సిపాలిటీ, 2వ వార్డు వానపల్లిగూడెం రోడ్, విజ్ఞాన్ వికాస్ స్కూల్ ఎదురుగా, డో.నెం. 4-88-2 (2) అసెస్మెంట్ నెం. 16088 గా గల 160 చ॥గ॥ స్థలము మరియు అందలి గల రెండు పోర్షన్‌ల రేకుల షెడ్డుకు హద్దులు.
తూర్పు: కాకర్ల శ్రీను గారి ఇల్లు. **దక్షిణం:** రోడ్. **పడమర:** రోడ్. **ఉత్తరం:** కానూరి సత్యనారాయణ గారి ఇల్లు.

పై హద్దుల మధ్య గల 160 చ॥గ॥ స్థలము మరియు అందలి గల రెండు పోర్షన్ల రేకుల షెడ్డు, రూఫ్, తలుపులు, కిటికీలు, కరెంటు కనెక్షన్, టాప్ కనెక్షన్ మొ॥ సర్వం సహా అన్ని యీజిమెంట్ హక్కులతో సహా.

Sk.Md.బాషా (SMB)
అడ్వకేట్, తాడేపల్లిగూడెం